క్లుప్తంగా

నిర్లక్ష్యం వీడండి.. పంపును పట్టించుకోండి



కొల్లూరు: ప్రజల దాహార్తిని తీర్చాల్సిన తాగునీటి పంపు ముళ్ల కంపల మాటున నిరుపయోగంగా మారింది. ఆవులవారిపాలెం అడ్డరోడ్డు సమీపంలో ప్రజా అవసరాల కోసం గతంలో పంచాయతీ నిధులతో తాగునీటి పంపును ఏర్పాటు చేశారు. ఇటీవల పంపు మరమ్మతులకు గురయ్యింది. పంచాయతీ యంత్రాంగం మరమ్మతులు చేపట్టకపోవడంతో.. ఆ ప్రాంతంలోని వ్యక్తులు ముళ్ల కంపలు, మట్టి వేయడంతో అధికాస్త నిరుపయోగంగా మారింది. పంచాయతీ అధికారులు స్పందించి, పంపునకు మరమ్మతులు చేపట్టి, వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కలుపు నివారణ చర్యలు చేపట్టాలి

రేపల్లె రూరల్: వెద పద్ధతిలో వరి పంట సాగు చేస్తున్న రైతులు కలుపు నివారణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని ఇన్‌చార్జి ఏడీఏ విజయ్‌బాబు తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన రైతులకు కలుపు నివారణ పద్ధతులను వివరించారు. నేరుగా విత్తనాలు విత్తే మడులలో కలుపు ప్రధాన సమస్యగా నెలకొందన్నారు. కలుపు నివారణలో వ్యవసాయ అధికారుల సూచలను పాటించాలని చెప్పారు. పలు కలుపు నివారణ మందుల పిచికారీ విధానాన్ని వివరించారు.

ఘనంగా ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు

భట్టిప్రోలు: మండలంలో మంగళవారం ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, చిన్నారులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుని అభినందనలు తెలుపుకున్నారు. దుకాణాల్లో రకరకాల ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు విశేషంగా ఆకట్టుకున్నాయి.

నోట్ పుస్తకాల పంపిణీ



వేమూరు: ప్రభుత్వం పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కార్తీక్ ఫౌండేషన్ సహకారం ఉంటుందని ఫౌండర్ నందూరి కార్తీక్ అన్నారు. మండలంలోని చావలి మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలను మంగళ వారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక్ పౌండేషన్ పేద విద్యార్థులను అనేక విధాలుగా అదుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విశ్వేశ్వరరావు, కల్యాణ లక్ష్మీ, ఎస్.రవికుమార్, ఎం.చందు, ఎం.మోహన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



వేమూరు: గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు వల్ల దోమలు ఎక్కువగా ఉంటాయని, దోమలు వల్ల అంటు వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతి వారం పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

నండూరులో విషాదం

పొన్నూరు: మండలంలోని నండూరు గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామంలోని వేర్వేరు కుటుంబాలకు చెందిన ఇద్దరు యువకులు చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురై గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తెలిసిందే. అయితే పొన్నూరు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఇద్దరిలో ఒకరు మృతి చెందారు. ఒకే రోజు ఇరువురు ఆత్మహత్యకు పాల్పడి ఒకరు మరణించిన ఘటన గ్రామస్తులను కలచివేసింది.

కుటుంబ కలహాలతోనే కార్మికురాలి ఆత్మహత్యాయత్నం

పొన్నూరు: పొన్నూరు పురపాలక సంఘం పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు కుటుంబ కలహాలతోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని మున్సిపల్ కమిషనర్ నయీం అహమ్మద్ తెలిపారు. ఆ కార్మికురాలు ఏ అధికారి ఇంటిలో పని చేయడం లేదని.. లైంగిక వేధింపుల కారణంగా కార్మికురాలు ఆత్మహత్యకు యత్నించిదని మంగళవారం సాక్షిలో ప్రచురితమైన వార్తకు కమిషనర్ వివరణ ఇచ్చారు. మున్సిపల్ కార్మికులు అధికారుల నివాసాలలో పనులు చేయరని, వారితో పనిచేయించుకుంటే శాఖ పరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వెదకు వెళ్దాం.. పదండి

- వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు వ్యవసాయ శాఖ ప్రణాళిక
- సాగు లాభాలపై రైతుల్లో విస్తృతంగా అవగాహన
- ఖరీఫ్‌కు పీవీపాలెంలో 5 వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం లక్ష్యం
- పెట్టుబడి తగ్గి..దిగుబడుల పెరగడంతో రైతులు మొగ్గు..



సాధారణ పద్ధతిలో వరి నాట్లు వేస్తున్న కూలీలు



చందోలు శివారు పొలాల్లో వెద పద్ధతిలో సాగు చేస్తున్న వరిపంట

పిట్టలవానిపాలెం: వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ ప్రణాళికలను రూపొందించింది. ఖరీఫ్‌లో వెద పద్ధతిలో వరి సాగు చేపట్టేందుకు రైతులకు అవగాహన కార్యక్రమాలను అధికారులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మండలంలో 12,500 ఎకరాల్లో వరి సాగు చేపట్టాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. వెద పద్ధతిలో సాగు చేయడం వల్ల కూలీల ఖర్చు తగ్గడంతో పాటు.. సాగునీటి అవసరం కూడా అంతగా ఉండదని గత నాలుగేళ్లుగా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. రైతులతో ప్రయోగాత్మకంగా వెద పద్ధతిలో పంటలు పండిస్తున్నారు.

ఐదు వేల ఎకరాలు లక్ష్యం..

చందోలు, కొత్తపాలెం, ఖాజీపాలెం, అలకాపురం, అల్లూరు, పిట్టలవానిపాలెం గ్రామాల్లో సుమారు ఐదు వేల ఎకరాల్లో వెద పద్ధతిలో వరి పంట సాగు చేసేలా ప్రణాళిక రూపొందించినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఇందుకు కొందరు రైతులు సిద్ధమైనట్లు తెలిపారు. ఈ విధానంలో రానున్న రోజుల్లో అడపా దడపా వర్షాలు కురిసినా పంటకు ఎలాంటి నష్టం ఉండదనే ఉద్దేశంతో రైతులు మొగ్గు చూపుతున్నారని వివరిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వెద పద్ధతిలో వరి సాగు చేపట్టగా.. సాంప్రదాయ విధానంలోనూ వరి సాగు మొదలైంది.

వెద సాగుతో లాభాలు



వెద పద్ధతిలో వరి సాగు చేయడం వల్ల తక్కువ పెట్టుబడి అవుతుంది. నాణ్యమైన అధిక దిగుబడి పొందుతున్నాం. గత ఆరేళ్లుగా ఇదే విధంగా వరి పండిస్తున్నాను. గతంలో వేరుశనగ పైరును కూడా వెద పద్ధతిలో సాగు చేసి, మంచి ఫలితాలు పొందాను.

– కరిముల్లా బేగ్, రైతు, చందోలు

రైతుల్లో ఆసక్తి



గత మూడేళ్లుగా వరిలో వెద పద్ధతి అవలంబిస్తున్నాం. ఇతర రైతులు కూడా ఈ విధానంపై ఆసక్తి చూపుతున్నారు. మా గ్రామంలో చాలా మంది రైతులు వెద పద్ధతిలో వరి పంట సాగు చేశారు.

– సాలేహ, రైతు, చందోలు

వెద పద్ధతి ఎంతో మేలు



వెదజల్లే.. విధానంలో వరి సాగు చాలా మేలైన పద్ధతి. సాగు ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చు. వెద పద్ధతిలో నేరుగా విత్తనాన్ని నాటుకోవడమే. అంతేకాక ఎకరానికి 8 కిలోల విత్తనం సరిపోతుంది. పెట్టుబడి తక్కువ ఉండి.. దిగుబడి ఎక్కువగా ఉంటుంది.

– లక్ష్మి, ఏడీఏ, బాపట్ల

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ప్రోగ్రాం సభ్యులు

రేపల్లె రూరల్: అపరిచిత వ్యక్తులపట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ క్రాఫ్ ప్రోగ్రామ్ మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు అన్నారు. మానవ అక్రమ రవాణా నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని బాలల స్నేహగ్రామాలైన విశ్వేశ్వరం, పెనుమూడి, చోడాయపాలెం, కారుమూరు, నల్లూరుపాలెం, పోటుమెరక, తుమ్మల, పిరాట్లంకలో మంగళవారం నిర్వహించిన మానవ అక్రమ రవాణాపై అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో సామాజిక మాధ్యమాలలోగాని, ఇతర మార్గాలలోగాని తమ వ్యక్తి గత సమాచారం ఇవ్వటం, తీసుకోవటంగాని చేయరాదన్నారు. నిత్యం దేశంలో ఏదొక ప్రాంతంలో లింగబేధం, చిన్నా పెద్ద లేకుండా ప్రతి ఒక్కరూ అక్రమ రవాణాకు గురవుతున్నారని చెప్పారు. తమ కుటుంబ సభ్యులు భద్రత పూర్తిగా తమపైనే ఆధారపడి ఉంటుందన్నారు. పరిసర ప్రాంతాలలోగాని అపరిచిత వ్యక్తులు అనుమానస్పద స్థితిలో సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. చైల్డ్ హెల్ప్ లైన్ నంబరు 1098, పోలీసు హెల్ప్‌లైన్ నంబరు 100లు తెలిసి ఉండాలని చెప్పారు. అక్రమ రవాణాకు గురైతే వెంటనే ఆయా నంబర్లుకు ఫోన్ చేసి సమాచారం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో క్లస్టర్ ఫీల్డ్ కోఆర్డినేటర్‌లు రత్న ఏజెంల్, నళిని, లక్ష్మీ ప్రసన్న, సంస్థ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ పద్ధతులతో నాణ్యమైన దిగుబడులు

డీడీఏ విజయనిర్మల



రైతులతో మాట్లాడుతున్న డీడీఏ విజయనిర్మల

కర్లపాలెం: వేరుశనగ సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటించి నాణ్యమైన దిగుబడులు పండించాలని డీడీఏ విజయనిర్మల తెలిపారు. కర్లపాలెం మండలంలోని దుండివారిపాలెంలో మంగళవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో వేరుశనగ సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ భూమి ద్వారా వ్యాప్తిచెందే వేరుకుళ్ళు కాండం కుళ్ల తెగుళ్ల నివారణకు ట్రైకోడెర్మా విరిడీ బాగా పనిచేస్తుందని రైతులకు తెలిపారు. బాగా చివికిన పశువుల ఎరువు 90కిలోలు, 10కిలోల వేప పిండి తీసుకుని దీనిలో ట్రైకోడెర్మా విరిడీ బాగా కలిపి నీడలో ఆరబోసి మిశ్రమేం పైన గోనెసంచి వేసి ఉంచాలని ఆమిశ్రమంలో నీళ్లు చల్లుతూ కలుపుకోవాలని 15రోజుల తరువాత వేరుశనగ విత్తనం విత్తే ముందుగా భూమిలో చల్లుకోవాలని సూచించారు. అలా చేయటం వలన వేరు కుళ్ల తెగులుతో కాండం తొలిచే పురుగును కూడా అరికట్టుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీపీఎం వాణిశ్రీ, ఏడీఏ లక్ష్మి, ఏఈ సుమంత్‌కుమార్, డీఆర్‌సీ ఏడీఏ రత్నకుమారి, ఏఈవోలు మన్నెం సునీత, గోపి, బాజీ, రైతులు పాల్గొన్నారు.

వెద సాగు పంట పొలాల పరిశీలన



కలుపు నివారణ సూచనలిస్తున్న ఏడీఏ విజయ్‌బాబు

భట్టిప్రోలు: భట్టిప్రోలు పరిధిలో వరి వెద పద్ధతిలో సాగు చేసిన పంట పొలాలను రేపల్లె ఏడీఏ ఆర్. విజయ్‌బాబు మంగళవారం మండల వ్యవసాయశాఖాధికారి జి. మీరయ్యతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా కలుపు నివారణ గూర్చి రైతులకు తగు సూచనలు చేశారు. వెద పెట్టిన వరి పొలాలకు 25 రోజుల్లో బిస్‌పైరీబాక్ సోడియం 10 శాతం ఎస్‌సీ (నామినీగోల్డ్) ఒక ఎకరాకు 80 నుంచి 100 గ్రాములు పిచికారీ చేయాలని తెలిపారు. అలాగే ఆల్‌మిక్స్ (మెట్ సల్ఫ్యూరాన్ మిథైల్ 10శాతం, క్లోరి మ్యూరాన్ ఇథెల్ 10శాతం డబ్ల్యూపీ)ని ఒక ఎకరాకు 85 గ్రాములు 5 నుంచి 6 ట్యాంకులు పిచికారీ చేయాలన్నారు. సరైన మోతాదును సరైన సమయంలో పిచికారి చేయడం వల్ల కలుపు నివారణ సులభ తరమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎఈవో వి. స్వప్న, వీఏఏ పి. రత్నరాజు, ఎంపీఈవో నరేష్ రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది

గుంటూరు జిల్లా ఉప విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు

ప్రత్తిపాడు: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఎం.ఎలిజబెత్ రాణి నేటితో ఉద్యోగ విరమణ చేయనున్నారు. మంగళవారం స్థానిక పాఠశాలలో హెచ్‌ఎం ఝాన్సీరాణి ఆధ్వర్యంలో ఎలిజబెత్ రాణి పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ ఈవో దుశ్శాలువా, పూలమాలలు, మెమెంటోలతో ఎలిజిబెత్ రాణిని సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎలిజబెత్ రాణి ఉపాధ్యాయ వృత్తికే వన్నె తీసుకువచ్చారన్నారు. విద్యార్థులకు విద్యా బుద్ధులను, క్రమశిక్షణను, నైతిక విలువలను నేర్పి, సమాజానికి ఉత్తమ పౌరులను అందించే అనిర్వచనీయమైన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించారని చెప్పారు. ఎంఈవో సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ఎలిజబెత్ కృషి చేశారన్నారు. ఎంఈవో-2 నిర్మల మాట్లాడుతూ సమర్థవంతంగా విధులు నిర్వహించినప్పుడు అందరి మన్ననలు పొందుతామన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు, ఉపాధ్యాయులు శైలజ, డి.చంద్రిక, శివకుమారి, వీరయ్య, నాగమల్లేశ్వరరావు, గ్రామ పెద్దలు చింపిరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల పరిశీలన

నిజాంపట్నం (రేపల్లె రూరల్): ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ అలవడేలా బోధన చేయాలని నిజాంపట్నం మండల ఇన్‌చార్జి ఎంఈవో కేసనశెట్టి సురేష్ అన్నారు. మండలంలోని కూచినపూడి, అడవులదీవి గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పథకం అమలును ప్రధానోపాధ్యాయులు నిత్యం పర్యవేక్షించాలన్నారు. పరిశుభ్రత వాతావరణంలో వంటలు తయారు చేసేలా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట ఉపాధ్యాయులున్నారు.

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

రేపల్లె రూరల్: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఈ నెల బుధవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శేషాద్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి కౌన్సిలర్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

డంపింగ్ యార్డు పరిశీలన



రేపల్లె రూరల్: పట్టణంలో నెలకొన్న డంపింగ్ యార్డు సమస్యను రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు, టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ మంగళవారం పర్యవేక్షించారు. పట్టణానికి వచ్చే రహదారులకు ఇరువైపులా మున్సిపాలిటీ చెత్తను పడవేయటంతో సమస్య జఠిలంగా ఉందని పలువురు ఇటీవల మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు విన్నవించారు. అనగాని ఆదేశాలతో శివప్రసాద్ మున్సిపల్ అధికారులతో కలసి మోంట్‌ఫోర్ట్ స్కూల్ వద్ద ఉన్న డంపింగ్ యార్డును పరిశీలించారు. సమస్యను మంత్రికి విన్నవించటంతో త్వరలో పరిష్కరించబడునని చెప్పారని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, పార్టీ అధికారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



తీవ్ర గాయాలపాలైన వెంకటేశ్వర్లు

ప్రత్తిపాడు: హైవేపై ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడటంతో ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలైన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గుంటూరు రూరల్ మండలం బుడంపాడుకు చెందిన భార్యాభర్తలు మాతంగి వెంకటేశ్వర్లు, భూషణకుమారిలు మంగళవారం ఉదయం తమ ఇంటి నుంచి పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలోని గణపవరంకు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. మార్గంమధ్యలో ప్రత్తిపాడు మండలం పార్వతీపురం 16వ నంబరు జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి కింద పడిపోయారు. ప్రమాదంలో వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు ఫోన్ చేయడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీనిపై రాత్రి వరకు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డు అందించాలి



సిబ్బందితో సమీక్షిస్తున్న తహసీల్దారు, ఏఓ

చెరుకుపల్లి: రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బంది సంయుక్తంగా ప్రతి కౌలు రైతుకు.. కౌలు గుర్తింపు కార్డు అందజేయాలని తహసీల్దారు సీహెచ్ పద్మావతి ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండల వ్యవసాయాధికారితో కలిసి మంగళవారం వ్యవసాయశాఖ, రెవెన్యూ సిబ్బందితో కౌలు గుర్తింపు కార్డుల పంపిణీ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ బాలాజీ గంగాధర్ మాట్లాడుతూ మండలంలో ఈ-క్రాప్ బుకింగ్ చేయాలని, కౌలు గుర్తింపు కార్డులు పొందని రైతులను గుర్తించి, వారికి కూడా కార్డులు అందించి, వాటి ప్రయోజనాలను వివరించాలని సూచించారు. అనంతరం గ్రామాల వారీగా ఎంత శాతం ఈ-క్రాప్ బుకింగ్ జరిగిందో తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

వేమూరు: మహిళల అక్రమ రవాణా విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ క్రాఫ్ పోగ్రాం మేనేజరు ఎన్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మానవ అక్రమ రవాణ నివారణ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ప్రతి వారం, నెలలో ఏదో రూపంలో బాల బాలికలు, మహిళల అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిపారు. విశ్వేశ్వరం, పెనుమూడి, చోడయపాలెం, కారుమూరు, నల్లూరుపాలెం, పోటుమెరక, తుమ్మల గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. అపరిచిత వ్యకులపై అనుమానం వస్తే హెల్ప్ లైన్ సెంటరు నంబరు 1098, పోలీసు డయల్ 100కి కాల్ చేసి.. సమాచారం ఇవ్వాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



నిత్యావసర సరుకులు, నగదు అందజేస్తున్న సురేష్

గణపవరం(కర్లపాలెం): అగ్ని ప్రమాదం సంభవించటంతో వంటపాత్రలతో పాటు గృహం పూర్తిగా దగ్ధమై కట్టుబట్టలతో ఉన్న బాధితులకు స్వచ్ఛంద సంస్థలు, అధికారులు ఆర్థిక చేయూతనందించి అండగా నిలవాలని బాపట్ల అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ పేర్కొన్నారు. మండలంలోని గణపవరం పంచాయతీలో ఉన్న చినపులుగువారిపాలెంలో సోమవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో కోమట్ల సైదాబిరెడ్డి పూరిగృహం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంటిలో ఉన్న గ్యాస్ సిలిండర్లు పేలటంతో మంటలు ఎగసి పక్కనే ఉన్న పశువుల పాక, వరిగడ్డి వామి కూడా పూర్తిగా దగ్ధమయ్యాయి. కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగా మంటల వలన వేడికి మెలకువ వచ్చి బయటకు పరుగులు తీయటంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. అఖండ ఫౌండేషన్ తరపున విన్నకోట సురేష్ రూ.15వేల నగదు, మినీ గ్యాస్ సిలిండర్ రైస్ బ్యాగ్, వంట పాత్రలు, నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు. అలాగే బాపట్ల ఫ్రెండ్స్ యూత్ ఆర్గనైజేషన్ గౌరవ అధ్యక్షుడు వేజెండ్ల శ్రీనివాసరావు, అధ్యక్షుడు బండ్రెడ్డి గోపి, సభ్యులతో కలసి బాధిత కుటుంబానికి రూ.3వేల నగదు, రూ.2వేల విలువగల వంటపాత్రలు, దుస్తులు అందజేశారు. అలాగే బాపట్ల రుక్మిణీ సమేత పాండురంగస్వామి దేవస్థానం ఆలయ అర్చకులు రొంపిచర్ల కేశవాచార్యులు రూ.2వేలు నగదు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తరపున జిల్లా చైర్మన్ బీఎస్ నారాయణభట్టు, మండల అధ్యక్షుడు ఇనకొల్లు పోలీస్‌రావులు బాధితులకు వంటపాత్రలు, తాత్కాలిక గుడారం కోసం పాలిథిన్ పరదా పట్టాను అందజేశారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



యాజలిలో నీటి తొట్టిలో ఎబెట్ ద్రావణం వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కర్లపాలెం: పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన అంటు వ్యాధులను నివారించుకోవచ్చునని జిల్లా మలేరియా కార్యాలయ ఆరోగ్య పర్యవేక్షకులు ఎండీ యూసఫ్ షకీల్ తెలిపారు. కర్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి గోపీనాథ్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య సిబ్బంది, మలేరియా అధికారులు మంగళవారం యాజలి గ్రామంలో పర్యటించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ నీరు నిలిచి ఉన్న ప్రదేశాలను గుర్తించి దోమల లార్వా నివారణకు ఎబెట్ ద్రావణం చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. దోమకాటు వలన ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా, మెదడువాపు లాంటి వ్యాధులు వస్తాయని చెప్పారు. గృహ పరిసరాలలో నీరు నిలిచి ఉండకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మలేరియా సూపర్‌వైజర్ జె.రాంబాబు, గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీత, వైద్య ఆరోగ్య సిబ్బంది ఇసాక్, జాషువా, ఎంఎల్ హెచ్‌పి దీప్తి సౌజన్య తదితరులు ఉన్నారు.

గజ ఈతగాళ్లకు స్విమ్మింగ్ దుస్తులు పంపిణీ



స్విమ్మింగ్ దుస్తులు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ అధ్యక్షుడు సురేష్

బాపట్ల: సముద్ర తీరంలో ఎంతోమంది ప్రమాదవశాస్తు మునిగిపోతున్నవారిని కాపాడి వారికి పునర్జన్మను ఇస్తున్న గజ ఈతగాళ్లను ఎంతైనా అభినందించాలని అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ అన్నారు. గజ ఈతగాళ్లకు స్విమ్మింగ్ దుస్తులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విన్నకోట మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువమంది బాపట్ల జిల్లా సూర్యలంక సముద్ర తీరాన్ని సందర్శించడానికి శని, ఆదివారాలు వస్తుంటారని తెలిపారు. దీంతో సూర్యలంక బీచ్ కళకళలాడుతూ ఉంటుందని పేర్కొన్నారు. సరదాగా కుటుంబ సభ్యులతో హాయిగా ఆహ్లాదకరంగా గడపడానికి బీచ్ కి అనేకమంది సందర్శిస్తూ ఉంటారని, వీరికి వచ్చే ప్రమాదాల నుంచి కాపాడేందుకు గజ ఈతగాళ్ల పాత్ర కీలకమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖండ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వంగపాటి శివ, పొట్నూరి బాలకృష్ణ, చేజర్ల సతీష్, గొర్ల ఆంజనేయులు, పులిగడ్డ శ్యాంప్రసాద్, కర్పూరపు శ్రీనివాసరావు, వేదాంత డెవలపర్స్ సోమశేఖర్, మెరైన్ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి



మృతుడు జంపని శ్రీను

బాపట్లటౌన్: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలోని శారదపురి కాలనీలో చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన జంపని శ్రీను (32) మంగళవారం మొహం కడుక్కునేందుకు.. గానుగ పుల్ల విరిచేందుకు చెట్టు కొమ్మను పట్టుకున్నాడు. చెట్టుమధ్యలో ఉన్న విద్యుత్ తీగ తగిలి షాక్ కొట్టింది. ఒక్కసారిగా శ్రీను కుప్పకూలిపోవడంతో స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దాడి..కేసు నమోదు

బాపట్లటౌన్: మహిళపై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన మండలంలోని కంకటపాలెంలో చోటుచేసుకుంది. కంకటపాలెం గ్రామానికి చెందిన కాటి సుశీలపై అదే గ్రామానికి పులిపాటి జర్మియ మంగళవారం దాడి చేశారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.